Regd. No. R. 18

విడిప్రతి 30 పైసలు

శుక్రవారం 24-11-72

యేషియన్
పెయింట్సు కంపెనీ
ఆఫ్‌కొలైట్ రంగులు అన్నియు
కంపెనీ వెలలకే మావద్ద
లభించును.
మద్రాసుకు పోనవసరంలేకుండానే!
మాదాల బాలతిమ్మయ్య,
సంతపేట – నెల్లూరు

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడుగారు

సంపుటి 44 సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి సంచిక 47

26-11-72 ఆదివారం నుండి
నెల్లూరు శ్రీలీలామహల్ లో
ఉదయం ఆటతో ప్రారంభం
UMANG
Eastman Colour
MUSIC: SANKAR-JAIKISAN
క్రొత్త తారలు అర్చనా, సతీష్
నటించిన గొప్ప మ్యూజికల్
రొమాంటిక్ హిట్ చిత్రం (హిందీ)

# రాష్ట్రపతిపాలన వుండబోదు!

## ప్రత్యేక రాష్ట్రము, పి. వి. పోవడం జరక్క పోవచ్చు

(ఈరోజు హైదరాబాదు టెలిఫోన్ వర్తమానం)

ఆంధ్రలో రాష్ట్రపతి పరిపాలన విధింపబడక పోవచ్చునని ఈరోజు హైదరాబాదునుండి వచ్చిన టెలిఫోన్ వర్తమానం తెల్పుతున్నది. ముఖ్య మంత్రి వ్యతిరేకులు రాష్ట్రపతిపాలనవస్తే పి. వి. పదచ్యుతుడవుతాడు కాబట్టి, ఆ విధంగా ఆకాంక్షించడం; ఆకాంక్షించడమే కాకుండ. ఢిల్లీలో ప్రయత్నించడంకూడ జరిగినట్లు తెలుస్తున్నదని మా విలేఖరి చెప్తున్నాడు. ఢిల్లీ వార్తలుకూడా రాష్ట్రపతి పరిపాలనా విధింపును ధృవపరచడం లేదని అంటున్నారు. ప్రధాని సూచించే ముల్కి పరిష్కారాన్ని అమలు జరిపే రాజకీయ యంత్రాంగం రాష్ట్రంలో వుండాలకాబట్టి, రాష్ట్రపతి పరిపాలనకు అవకాశమేలేదని భావింపబడుతున్నది.

రాష్ట్ర విభజనప్రసక్తే లేదని ప్రధాని రాజ్యసభలో నిర్ద్వంద్వంగా ప్రకటించివేసింది హైదరాబాదులోకూడా ఆ అభిప్రాయమే ప్రతిధ్వనిస్తున్నది. అంతేకాకుండ ముఖ్యమంత్రిగా పి. వి. నరసింహారావు వైదొలగింపబడేప్రశ్నే లేదని హైదరాబాదు రాజకీయవర్గాలలో వినిపిస్తున్నది. ఈ విషయాన్ని ఢిల్లీ నాయకులు పదేపదే స్పష్టంచేసి చెప్పారనికూడా అంటున్నారు. అయితే ఢిల్లీలో పి. వి. ప్రతిష్ఠ దెబ్బతిన్నదని అంటున్నారు. రాష్ట్రంలో పరిస్థితిని సమర్థవంతంగా చక్కదిద్దలేక పోయాడనే అభిప్రాయం కేంద్రనాయకుల్లో ఏర్పడిందట, కాని నాయకత్వంమార్పుకుమాత్రం వారు విముఖులని గట్టిగా తెలియవస్తున్నది.

కేంద్ర హోంశాఖ స్టేట్‌మంత్రి శ్రీ మీర్జా నిన్న హైదరాబాదువచ్చి, విజయవాడ పోయివున్నారని, ఈరోజుమధ్యాహ్నానికి హైదరాబాదు చేరవచ్చునని తెలుస్తున్నది. ఢిల్లీవార్తలనుబట్టి, శ్రీ మీర్జా విజయవాడలోచెప్పినదానినిబట్టి, ప్రధాని పరిష్కారం, రాష్ట్రంలో ప్రశాంత పరిస్థితి నెలకొనేవరకు ప్రకటింపబడకపోవచ్చు ననిపిస్తున్నది. ప్రధాని పరిష్కారమార్గం ఏ విధంగా వుండబోయేది ఎవ్వరూవూహించలేకున్నారు. హైదరాబాదునగరానికి సంబంధించి, దాన్ని స్వేచ్ఛానగరం అనకుండా, ఆంధ్రులకు ఇతోధికంగా సౌకర్యాలు

—కొరవ 6 వ పేజీలో

## దయానందరావు దీక్ష విరమణ



ముల్కి నిబంధనలను నిరసిస్తూ 14 తేదీ నుండి అమరణదీక్ష చేస్తున్న వి. ఆర్. కాలేజి విద్యార్థి శ్రీ టి. దయానందరావు ఈ రోజు (24వ తేది) ఉదయం 9 గంటలకు దీక్ష విరమించాడు.

ఈ ఘోరదీక్ష వుపసంహారం చేకోవలసిందిగా విద్యార్థులు, ఎన్. జి. ఓ.లు, స్థానిక నాయకులు, అధికారులు కోరారు. ఆందోళన తీవ్రరూపం దాల్చింది గనుక; ఆంధ్రప్రాంతమంతా ఉద్రిక్తంగా, ఉధృతంగా నిరసన తెలియజేయబడ్డాంది గనుక; అమరణ నిరాహారదీక్షవల్ల ఉద్యమానికి జరగ

—కొరవ 6వ పేజీలో

# గుంటూరు గుంపు ఒంగోలును రెచ్చగొట్టింది!

## కాల్పులకు కలెక్టరు తొందరపాటే కారణమని ఏకాభిప్రాయం

21 తేది ఒంగోలు చరిత్రలో విషాద దినం. క్రొత్తజిల్లా ఏర్పడిన తర్వాతనే కాదు. అంతకుముందు ఎప్పుడు కూడా పోలీస్ కాల్పుల్లో నలుగురు బలికావడమనేది జరగలేదు. అందువల్లే నవంబరు 21 ప్రజల హృదయాల్లో చీకటిరోజుగా శాశ్వతంగా నిల్చిపోతుంది.

ఆ రోజు ఇంత విపత్తు జరుగుతుందని ఎవ్వరూ వూహించలేదు ఎన్. జి. ఓ. ల పిలుపుతో ప్రారంభమైన బంద్ శాంతంగానే జరిగిపోతుం దనుకున్నారు. ఆఫీసులేవు, అంగళ్లులేవు, బస్సులులేవు, బండ్లులేవు- ఏమీలేవు; పౌరజీవితం పూర్తిగా స్తంభించి పోయింది. అయితే ఆ రోజు వుద్రిక్త నినాదాలతో ప్రారంభమైంది. వేకువ నాలుగుగంటలకే తీవ్రంగా గుంటూరు నుండట, ఒక గుంపు వచ్చింది. వీధివీధి, గొందెగొందె తిరిగింది. నగర సంకీర్తనం వలె, రెచ్చగొట్టేనినాదాలను ప్రతిధ్వనింప చేసింది. హైదరాబాదులో ఆంధ్రులను పెట్రోలుపోసి తగులబెట్టేస్తుంటే, మీరు నిద్రపోతున్నారా అని అరచారు. నినాదాలన్ని ఆ విధంగానే రక్తం వుడికించేట్లుగా వుండినాయి. ఆ రోజు ఇంకా రైల్వేస్టేషన్ వద్ద కాల్పులు జరగనేలేదు; కాని ఈగుంపు మాత్రం ఉషస్సులో కాల్పులు జరిగిపోయాయని, విద్యార్థులు తదితరులు చంపబడ్డారని నినాదాలిస్తూ తిరిగింది. అరోజు కాల్పులకు, నలుగురి చావుకు ఈ గుంటూరువారి హింసాప్రేరక నినాదాలే కారణమని చెప్పలేకపోయినా; టవున్‌లో వుద్రిక్త పరిస్థితి గలగడానికి మాత్రం వీరు కారణమని చెప్పడం పొరపాటు కాబోదు.

రెండవది: వ్యక్తి, వర్గ, పార్టీ రహితంగా ముక్తకంఠంగా వినబడుతున్న అభిప్రాయం–కలెక్టరు శ్రీ బి. ఆర్. ప్రసాద్ చాల తొందరపడ్డారని, దుడుకుపడ్డారని; కాల్పులతో అవసరం లేకుండానే పరిస్థితిని అదుపులోపెట్టివుండవచ్చునని విశేష గీతంగా అభిప్రాయపడుతున్నారు. కలెక్టరు మీద పట్టణంలో తీవ్రమైన వ్యతిరేకత ప్రబలివుంది. కలెక్టరును వెంటనే సస్పెండుచేయాలని, హైకోర్టు న్యాయమూర్తి చేత విచారణ జరిపించాలని ఒంగోలు బార్ అసోసియేషన్‌వారు చేసిన తీర్మానం, ప్రజాభిప్రాయానికి ప్రతిబింబమనవచ్చు. ఒంగోలు న్యాయవాదులు నిరవధికంగా కోర్టులకు పోవడం మానివేయాలని నిర్ణ

—కొరవ 6 పేజీలో

★ నూతన రూపం!
★ వినూతన మార్గం!!
★ అధునాతన సౌకర్యం!!!

తొమ్మిది సంవత్సరాలు మీఅభిరుచులకు తగిన రుచులనందించి, మీ ఆదరాభిమానాలే తన అభ్యుదయంగా, అభ్యున్నతిగా భావించి, మీకు అత్యంత ప్రీతిపాత్రంగా, సంతృప్తికరంగా నిలిచిన

మీ

మంజు–అప్సర

త్వరలో క్రొత్తరూపం సంతరించుకోబోతుంది; క్రొత్తమెరుగులు దిద్దుకోబోతుంది; మిమ్ము అలరించడానికి అలంకరించుకోబోతుంది.

—మేనేజ్‌మెంటు,
హోటల్ మంజు–అప్సర,
నెల్లూరు.

కామధేను శిల్క్స్
(APPROVED RETAIL CALICO SHOW ROOM)
న్యూ టెక్స్‌టైల్స్ షో - రూము
చిన్నబజారు (Tel; 946) నెల్లూరు.
మీ అభిరుచులకు అనుగుణంగా నాగరిక డిజైనులలో అన్నిరకములు తెప్పించియున్నాము.
కంచి - కొళ్ళగాల్
ధర్మవరం - బెనారస్
ఔరంగాబాద్ - వరయూర్
మాధవరం - మధుర
కోయంబత్తూరు - కోడంబాకం
గ్వాలియర్, కాల్‌సిల్కు, బాంబే డైయింగ్,
మఫత్‌లాల్ బెంగాల్ సూటింగులు
షర్టింగులు, ధోవతులు.
"సీత్రూ టెరీకాట్ షర్టింగు" మావద్దే దొరుకును
దయచేసి ఒకసారి విచ్చేయండి. అందరి కోర్కెలు తీర్చగల కామధేనువు అని రుజువుకాగలదు.

**అటు లెవీ చెల్లించుకొని, ఇటు గిట్టుబాటు ధరకు అమ్ముకొనే వీలులేకుంటే రైతు ఏమిచేయాలి?**

# ప్రభుత్వం రైతుగొంతుకుఉరిత్రాడు బిగిస్తున్నది!

ఆంధ్ర ప్రభుత్వం లెవీ విధానాన్ని ప్రకటించింది; ధాన్యం ధరలను నిర్ణయించింది. మొన్న అక్టోబర్ ఆవతల కోతకువచ్చే ధాన్యానికి ఇది వర్తిస్తుంది.

లెవీకి సంబంధించి, ప్రతి రైతు లెవీని వ్యవనే పెట్టింది ప్రభుత్వం. 10 ఎకరాల పైన, పెద్దనీటి వసతి క్రిందవున్న మాగాణి భూమికి ఎకరాకు 4 క్వింటాళ్ళు (షుమారు 10 బస్తాలు); చిన్ననీటి వసతి క్రింద అయితే ఎకరాకు 3 క్వింటాళ్ళు—

5 ఎకరాలపైన, 10 ఎకరాలవరకు (పదిఎకరాలలోపు) పెద్దనీటివసతి క్రింద అయితే ఎకరాకు 3 క్వింటాళ్ళు, చిన్ననీటి వసతి క్రింద అయితే ఎకరాకు 2 క్వింటాళ్ళు—

రైతు ప్రభుత్వానికి లెవీ ఇవ్వవలసి వుంటుంది. డెల్టా భూములకు ఎక్కువ, చెరువుల క్రింద మాగాణులకు తక్కువ లెవీ నిర్ణయించబడిందన్నమాట. ఈ లెవీని ప్రభుత్వాధికార్లయినా వసూలుచేయవచ్చు; లేక ప్రభుత్వం నిర్ణయించే ఏజంట్లయినా సేకరించవచ్చు. లెవీ ధాన్యం చెల్లించనిదే రైతు తన ధాన్యాన్ని అమ్ముకోడానికి వీలులేదు.

ఐదుఎకరాల లోపుగావున్న రైతు లెవీనుండి మినహాయింపబడినాడు.

లెవీ పోను రైతువద్దవున్న మిగులు ధాన్యాన్ని కొనుగోలుచేసే మిల్లరు, తాను కొనే ధాన్యంలో 75 శాతం ప్రభుత్వానికివ్వాలి; మిగిలిన 25 శాతం తాను స్వేచ్ఛగా అమ్ముకోవచ్చు

—ఇదీ ప్రభుత్వ లెవీ విధానం. ఈ విధానం తర్వాత మరలా మారబోతుంది. రైతు లెవీరేటులో మార్పువుండకపోవచ్చు; కాని మిల్లరుమాత్రం తానుకొనే ధాన్యమంతా (75 శాతం కాకుండ నూటికి నూరుపాళ్ళు) ప్రభుత్వానికి సమర్పించుకోవలసి వుంటుంది. దీన్నిబట్టిచూస్తే ధాన్యం వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టాలనే విధానాన్ని అమలుజరపడమే అవుతుంది. ఆ పేరు పెట్టకుండా, లెవీ పద్ధతి అంటున్నారు; అంతమాత్రమే!

ఇదివరలో మిల్లరు ఇవ్వవలసిన లెవీ శాతం 25 నుండి 50 పెంచినప్పుడే (కొన్ని జిల్లాలలో 75 శాతం కూడా!) పెక్కుమంది మిల్లర్లు ధాన్యం వ్యాపారానికి సలాంకొట్టారు. నూకల పేరుతో బియ్యం ఎగుమతిచేసే చిల్లరగుంట వ్యవహారాలకు సిద్ధపడే ఘటనాఘటన సమర్థులైన వ్యాపారుల తప్ప, తక్కినవాళ్ళ చేతులు ముడుచుకున్నారు. 50 శాతం లెవీ ప్రభుత్వానికిచ్చినా, తక్కిన 50 శాతం దొంగరవాణాద్వారా ఆనష్టాన్ని పూడ్చుకొని లాభం సంపాయించవచ్చుననే ఆశ, అవకాశం వున్నంతవరకు నెల్లూరుజిల్లాలో కొందరు మిల్లర్లు వ్యాపారంచేశారు. విజిలెన్సు, తదితరుల నిర్బంధాలు ఎక్కువయ్యేసరికి ఆ కొద్దిమందికూడా దాదాపు మానేసినట్లే వున్నారు. మానేయక ఏమి చేస్తారు? మొలగొలుకు ధర తీసుకోండి; ప్రభుత్వ నిర్ణీతధర పుట్టి (850 కిలోలు) రూ 552–50 లు; బయట మార్కెట్‌లో రూ 600 లతో ప్రారంభమై రూ 800 లకు చేరింది; అది రూ 900 లకు కూడా పోవచ్చు. పుట్టికి రూ 50 లు మొదలు రూ 350 ల వరకు నష్టంపెట్టుకొని, ప్రభుత్వానికెవరివ్వగలుగుతారు? వ్యాపారి నాలుగుపావులు మిగల్చుకోడానికి వ్యాపారం చేస్తాడుకాని, ప్రజాసేవకు కాదుగదా! ఖర్చులు, తరుగులు, బోనస్‌లు వగైరాలక్రింద ఫుడ్ కార్పొరేషన్ తనవద్దవున్న బియ్యంనెత్తిన ఎంత అదనపు బరువును వేస్తున్నదిచూడినప్పుడు, ప్రయివేటు వ్యాపారస్తుడు లాభాన్ని ఆశించడంలో తప్పేముంది?

**మా కర్షక విలేఖరి**

ఈ చర్చనోద్దేశ్యం ప్రయివేటు వ్యాపారస్తుని సమర్థించి, కార్పొరేషన్‌ను విమర్శించడంకాదు. రెంటిలోనూ మంచి చెడ్డ రెండూ వున్నాయి. అదికాదు ఇప్పటి సమస్య; ధాన్య వ్యాపారంలో ప్రయివేటు వ్యాపారస్తుడనేవాడు లేకుండా, కేవలం ప్రభుత్వమే కొనేట్టుంటే రైతు పరిస్థితి ఏమిటా అనేది ఆలోచించి తీరవలసిన సమస్య. అటులెవీ చెల్లించుకొని, ఇటు మిగిలిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు అమ్ముకోడానికివీలులేకుంటే ఏమిచేయాలి? ప్రభుత్వం రైతు గొంతుకు వురితాడువేస్తున్నది; అతన్ని దివాలా తీయించచూస్తున్నది; పరోక్షంగా అధికోత్పత్తికి దావు దెబ్బ కొడుతున్నది!

ఆహారధాన్యాల పంపకంలో ప్రభుత్వ అజమాయిషీ వుండవలసిందే; కొరత వున్నన్నిరోజులు వుండితీరవలసిందే. కేవలం ప్రయివేటు వ్యాపారులకే వదలితే, వాళ్ళు దేశాన్ని ముంచివేస్తారు, ప్రజల ప్రాణం తీసివేస్తారు! మేమచెప్పేది, వ్యవసాయ ఖర్చులు, రైతు స్థితిగతులు తెలిసి కాని ధాన్యానికి ధర ముట్టచెప్పడం అవసరమనేది! జనవరిలో ఒకేధర, డిసెంబరులో అదేధర వుండడం సమంజసమా అనేది ప్రభుత్వం ఆలోచించాలి. నిల్వవుంచినందుకు ఫుడ్ కార్పొరేషన్‌కు తరుగులు, నిర్వహణ ఖర్చులు, వడ్డీలు గిడ్డీలు ఏ విధంగా అవుతున్నాయో; రైతు వద్ద వున్నా ఆ విధంగానే అవుతాయి. అది గమనించకుంటే రైతు చితికిపోతాడు, అధికోత్పత్తికి వుత్సహించలేక పోతాడు. ధాన్యంధర మితిమీరడం వుచితంకాదు, అది శ్రేయస్కరమూకాదు, కొనుగోలుదార్ల శక్తికి మించితే అదీ ప్రమాదమే! అందువల్లనే ప్రభుత్వం నిర్ణయించేధర మొదటనే న్యాయమైనదిగా వుండాల. ఆ ధర న్యాయమైనదైతే, రైతు బాధపడడు; ప్రభుత్వ ధరకు— మార్కెట్ ధరకు అంతరం లేకుంటే, వ్యాపారి దొంగదారులు వెతుక్కోడు!

న్యాయమైనధర అంటే ఎంత? ఇప్పుడు నిర్ణయించింది మాత్రం సరైనధరకాదు. పుట్టి రూ 600 అనేది కనీసధర అయిపోయింది. అంతకంటే తక్కువకివ్వాలంటే, రైతుకు మనస్కరించదు. అదీకాక, న్యాయమైనధర నిర్ణయించేటప్పుడు, వ్యవసాయ ఖర్చులూ పరిగణనకు తీసుకోవాలి. రసాయనిక ఎరువులకే రైతు ఎకరాకు కనీసం రూ150, 200 వెచ్చిస్తున్నాడు. పంటకొచ్చేలోగా మూడుసార్లయినా ఎరువులు వేయనిదే పండడంలేదు. ఆ ఎరువులు బ్లాక్ మార్కెట్‌లోతప్ప రాజీనంతగా దొరకటం లేదు. ఇక ట్రాక్టరు రుసుము, కూలిరేట్లు సామాన్యంగాలేవు. అన్నీ చూసుకుంటే ఖరీఫ్ సీజన్లోనే ఎకరాకు నాలుగైదువందలైనా ఖర్చవుతున్నది. అధికదిగుబడిచ్చే వరిరకాలైతే ఈ ఖర్చు మరీ ఎక్కువ. నెల్లూరు తాలూకాలో ఒకరైతు నన్నై ఎకరాల్లో ఐ. ఆర్. 20 వేశాడు; వేసిన వారం పదిరోజులకు వెల్లువ పడింది. దాన్ని మామూలుగా తీసుకరావాలని, దుక్కిలో కొట్టేసిన 40 బండ్ల పేడ ఎరువు, దుక్కిలోవేసిన రెండు బస్తాల మిశ్రమఎరువు; వేతకుపట్టిన మితిమీరిన ఖర్చు దండగపోకూడదు; అంత ఖర్చు పెట్టి, శ్రమపడిచేసి మూడుపుట్లయినా పండించకుంటే పరువుపోతుందని— తెచ్చే బస్తాలకు, కమ్మరిస్తున్న బస్తాలకు (ఎరువు) సందులేకుండావుంది. ఎకరాకు 700 రూలకు తక్కువకేకుండా ఖర్చవుతుందని అతని అంచనా. ఖర్చేమో ఖచ్చితంగా తెలిసిపోతుంది; రాబోయేపంట దైవాధీనం! ఈ రకమైన పరిస్థితిలో చాలామంది రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ధాన్యం ధర నిర్ణయించేటప్పుడు ప్రభుత్వం ఈ వాస్తవాలన్నిటిని గమనించాలి. అంతేకాక, తాను నిర్ణయించిన ధరకు రైతు ఇచ్చేట్టుంటే ప్రభుత్వం వెంటనే కొనగలిగిన స్థితిలో వుండాలి; మెలగులాలుపెట్టి వారిని విసిగించకూడదు.

—కొరవ 10 వ పేజీలో



